క్లుప్తంగా

నేడు పెంచికలపాడులో కంటి వెలుగు శిబిరం

గట్టు: మండలంలోని పెంచికలపాడులో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించనునట్లు ఆదివారం సీహెచ్‌ఓ ఊసేని ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అదేవిధంగా బోయలగూడెంలో కూడా కంటి వెలుగు కేంద్రం ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కల పెంపకంపై దృష్టి

మల్దకల్: మొక్కల పెంపకంపై దృష్టి సారిస్తున్నామని సర్పంచు పద్మమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని బూడిదపాడు, అమరవాయి గ్రామాలలో ఏర్పాటుచేసిన నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచి వాటిని సంరక్షించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే హరితహారంలో నాటిన మొక్కలకు ఉదయం , సాయంత్రం వేళలలో నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై పోలీసుల కళాజాత

ధరూరు: మండలంలోని నెట్టెంపాడులో సామాజిక అంశాలపై ఆదివారం పోలీసుల కళాజాత నిర్వహించారు. మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కర్నె శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఏ ఆపద వచ్చినా హెల్ప్‌లైన్ నంబర్లు 100, 1098, 112లకు కాల్ చేయాలన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దన్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వాట్సాప్ నంబరు 9494921100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు హనుమంతు, దివ్యవాణి, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



అమరచింత: పట్టణంలోని సయ్యద్‌షా రాజవలి దర్గా షరీఫ్‌లో ఆదివారం దర్గాలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. దర్గా అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు షానవాజ్ ఖాన్, షాహిన్ రఫి, ఖాజామైను, తౌఫిక్, ఇంతియాజ్, ఫరీద్, కలాంపాషా, మోహిన్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి నివాళి

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది దేవినేని లక్ష్మణ్‌ప్రసాద్(64) ఆదివారం అకస్మాత్తుగా మృతి చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం కర్నూలు జిల్లాలోని జోగారావు టైప్ ఇనిస్టిట్యూట్‌లో వృత్తిలో భాగంగా పనులు చేస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలాడు. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా 108 సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు న్యాయవాది భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య చిలకమ్మతో పాటు కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



అలంపూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఉండవెల్లి మండలం అలంపూర్‌చౌరస్తాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని, కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని ఢీకొంది. కారు నుజ్జునుజ్జ కాగా అందులో ఉన్న ఇద్దరు ఇరుక్కోవడంతో వారిని బయటికి తీయడానికి స్థానికులు శ్రమించాల్సి వచ్చింది. కారులో ఉన్న మహ్మద్, జుబేద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇదే కారులో ఉన్న మరొక వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మహ్మద్ పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. ఉండవెల్లి ఎస్‌ఐ బాలరాజును వివరణ కోరగా ప్రమాదానికి సంబంధించి సమాచారం ఉందని వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదన్నారు.

వంతెన కష్టాలు తీరేనా?

- వర్షాకాలంలో తప్పని తిప్పలు
- వేసవిలోనే పనులు పూర్తి చేయాలని వేడుకోలు



ఉధృతంగా పారుతున్న తొత్తినోనిదొడ్డి వాగు(ఫైల్)

అయిజ: వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామస్తుల కష్టాలు అంతా ఇంతా కాదు. ప్రజాప్రతినిధులు వాగులపై వంతెనలు నిర్మిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితం అయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఒకే సమస్యతో సతమతమవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రైతులు, వృద్ధులు, విద్యార్థుల తిప్పలు తీరేదెన్నడో అని వివిధ గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతుంటే మండలంలోని దేవబండ, సింధనూరు, తొత్తినోనిదొడ్డి, ఉత్తనూరు, చిన్నతాండ్రపాడు గ్రామస్తుల కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దుస్థితి ఏర్పడింది. వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ఆయా గ్రామస్తులు అతి కష్టం మీద వాగు దాటుతూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సాహసం చేస్తూ ప్రయాణం చేయాల్సిందే. కొందరు గాయపడిన ఘటనలు ఉన్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవి కాలంలో పనులు చేసేందుకు అనువుగా ఉంటుందని ప్రభుత్వం వెంటనే వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిలిచిపోతున్న రాకపోకలు..

గత సంవత్సరం సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వివిధ గ్రామాలవద్ద వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వరద ఉధృతికి రాకపోకలు నిలిచాయి. తొత్తినోనిదొడ్డి, సింధనూరు, చిన్న తాండ్రపాడు, దేవబండ తదితర గ్రామ శివార్లలో వాగులు ఉప్పొంగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మేడికొండ శివారు సమీపంలోని కల్వర్టుపై తండ్రి కొడుకులు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా వరద తాకిడికి బైక్ కొట్టుకుపోయింది. అతి కష్టంమీద తండ్రి కొడుకులు బతికి బయటపడ్డారు. ఇంత జరుగుతున్నా అధికారులు, పాలకులకు చీమకుట్టినట్లుకూడా లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలోనే వాగులు, వంకలవద్ద వంతెనలు, కల్వర్టులు నిర్మించాలని కోరుతున్నారు.

వేసవికాలంలో పనులకు అనుకూలం



వర్షాకాలంలో పనులకు ఆటంకం ఉంటుంది. వేసవికాలంలో నీరు తగ్గుముఖం పట్టడంతో పనులు చేసేందుకు అనుకూలంగా ఉంటుంది. అనేక గ్రామాల్లో కనీసం కల్వర్టులు కూడా నిర్మించలేదు. వాగులు, వంకలవద్ద కొన్ని సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన కల్వర్టులు శిథిలమయ్యాయి. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అవసరమైన ప్రదేశాల్లో కల్వర్టులు, బ్రిడ్జిలు నిర్మించాలి. – ఖాజా, అయిజ

ఆధునిక టెక్నాలజీతో నిర్మించాలి



గతంలో వాగులు, వంకల వద్ద నిర్మించిన కల్వర్టులు, వంతెనలు నాణ్యత లేకపోవడంతో శిథిలం అయ్యాయి. వచ్చే వానాకాలం నాటికి ఆధునిక టెక్నాలజీతో కల్వర్టులు, వంతెనలు నిర్మించాలి. అవసరమైన కొత్త ప్రదేశాల్లో కూడా వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి. పనులు నాణ్యతగా ఉండే విధంగా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి. – నారాయణరెడ్డి, ఉప్పల

గతంలో నివేదికలు పంపించాం



మండలంలోని అనేక గ్రామాలవద్ద వాగులు, వంకలపై వంతెనలు, కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో ప్రజలు వాగులు, వంకలు దాటలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరమైన ప్రదేశాల్లో వంతెనలు నిర్మించాలని గత సంవత్సరం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. ఇంతవరకు ఎటువంటి స్పందన లేదు. మళ్లీ నూతనంగా ప్రతిపాదనలు పంపుతాం. – సాయిప్రకాష్, ఎంపీడీఓ

బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడదాం



మెన్నిపాడులో వృద్ధురాలితో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

ఉండవెల్లి: బీఆర్‌ఎస్ పాలనకు చరమ గీతం పాడదామని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని బొంకూరు, మెన్నిపాడు, పుల్లూరు, కలుగొట్ల గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామంలో చూసినా కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లే కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఆర్‌డీఎస్ రైతులకు నిరంతరం నీరు అందే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో అయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో ప్రభాకర్‌రెడ్డి

ధరలు తగ్గించాలి

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చెనుగొనిపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల పెరుగుదలతో గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే గద్వాల ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. గ్రామస్తులను పలకరిస్తూ ముందుకు సాగారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. యాత్రలో నాయకులు బల్గెర నారాయణ్ రెడ్డి, వీరుబాబు, రఘు నాయుడు, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, విజయ్ కుమార్, రమేష్, రాజు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలో ఆదివారం గ్రామ మత్స్య సహకార సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు చిన్న మల్లేష్, కార్యదర్శి పెద్ద జంబయ్య, డెరెక్టర్‌గా చిన్న జంబయ్య, తిమ్మప్ప, పెద్ద మల్లేష్, మునెప్పలు ఎన్నికయ్యారు. మత్స్యశాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యం



అమరచింత: అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యమని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్‌లతో కలిసి ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ డీఎంఆర్‌ఎం ట్రస్టు ద్వారా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.
కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్, కలాంపాషా, భాస్కర్ సింగ్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను మండలికి పంపిద్దాం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డి

అయిజ: ప్రశ్నించే గొంతుకను మండలికి పంపిద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పల క్యాంపు, యాపదిన్నె, చిన్నతాండ్రపాడు, తొత్తినోనిదొడ్డి, మూగోనిపల్ల గ్రామాలతోపాటు అయిజ పట్టణంలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీన్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి బీజేపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శేఖర్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు లక్ష్మన్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

అయిజకు చేరుకున్న 'చైతన్యయాత్ర'



తూంకుంటలో మాట్లాడుతున్న కిన్నెర సిద్ధార్థ

అయిజ: పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. ఉచిత విద్య, వైద్యం అందించాలని కోరుతూ మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌లో ప్రారంభమైన చైతన్య యాత్ర ఆదివారం మండలంలోని తూంకుంట గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా కిన్నెర సిద్ధార్థ మాట్లాడారు. పేద ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించేవరకు పోరాడుతామన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో యాత్ర కొనసాగిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం



తూర్పుతండా పల్లె ప్రకృతి వనంలో ఎండిన మొక్కలు

కేటీదొడ్డి: పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలని ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు చేసింది. నాటిన మొక్కలను అధికారులు ఎప్పటికప్పడు పర్యవేక్షించాలని సూచించారు. కాని అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని తూర్పుతండా గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలకు నీరు లేక మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. అధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులే చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మొక్కలను సంరక్షించాలని కోరుతున్నారు.

ఘనంగా దొడ్డి రాయుడి ఊరేగింపు



దొడ్డి రాయుడు స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో శనివారం రాత్రి దొడ్డిరాయుడు స్వామి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. ఉత్సవాల్లో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

టీడీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం

మానవపాడు: అన్ని వర్గాల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ పాటుపడుతుందని ఆ పార్టీ అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలో పెద్దపోతులపాడులో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. ఇంటింటికి తెదేపా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి, రవికుమార్ సుధాకర్‌గౌడ్, గజేంద్రగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



అలంపూర్ చౌరస్తాలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. ఆదివారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులతో చికిత్స పొందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో 41 మందికి సీఎం సహాయ నిధి నుంచి రూ.11,78500 విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, నాయకులు రమణ, శ్రీనివాస్ గౌడ్, నాగేశ్వర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, జయచంద్రారెడ్డి, ముగేన్న, వెంకటేశ్వర్ రెడ్డి, నర్సన్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మల్లికార్జున్, అనిల్ తదితరులు ఉన్నారు.

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ధరూరు, గద్వాల మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఎల్‌వోసీ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ధరూరు ఎంపీపీ నజీమున్నీసాబేగం , శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో వ్యాధులు దూరం



బోరవెల్లిలో ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న పిరమిడ్ మాస్టర్

మానవపాడు: ధ్యానంతో దీర్ఘకాలిక వ్యాధులు కూడా దూరం అవుతాయని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్తలు గోపాల్, రాజమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని బోరవెల్లి, జల్లాపురం, పల్లెపాడు, చండూరు గ్రామాలలో ధ్యానంపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుండె, బీపీ, షుగర్, కిడ్నీ సంబంధిత జబ్బులను ధ్యానం ద్వారా నయం చేసుకోవచ్చన్నారు. ప్రతిరోజు ధ్యాన సాధన చేయడం ద్వారా ఎన్నో ప్రయాజనాలు ఉంటాయన్నారు. మానసిక ప్రశాంతతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందుతాయన్నారు. ఎవరి వయసు ఎంత ఉందో అన్ని నిమిషాలు ధ్యానం చేయాలని కోరారు. కార్యక్రమంలో బంగ్లా ఆంజనేయరెడ్డి, బాలకృష్ణారెడ్డి, కవిత, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, రాధ, సుభద్ర, శోభిత, స్వప్న, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే విజయం సులువు



కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి

గట్టు: ఇష్టంతో చదివితే విజయం సులువు అవుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కళాశాల పదో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు, జానపదగేయాలు, సాంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియేట్ విద్య కీలకమన్నారు. క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. చెడు అలవాట్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు విచక్షణ కోల్పోకుండా స్వీయ నియంత్రణ కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కేఎస్‌డీ రాజు, శ్యాంసుందర్, రంగస్వామి, మహేష్, మధు, విష్ణు, మహేష్, ఆంజనేయులు, సిబ్బంది గోపాల్, రమేష్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

ధరూరు: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద అంబేద్కర్ చిత్ర పటానికి నాయకులు పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సుదర్శన్,(అల్వలపాడు,), ఉపాధ్యక్షుడు రాజు(ధరూరు), నవీన్(మన్నాపురం), ఆనంద్(మార్లబీడు), ప్రధాన కార్యదర్శిగా రమేష్, ప్రచార కార్యదర్శిగా రవి, కోశాధికారి జనార్దన్, జాయింట్ సెక్రటరీగా జయపాల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పచ్చర్ల పరుశరాం, రముడు, రవిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుడకల ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు హాజరయ్యారు.

పుష్కరఘాట్లలో ఇనుప కంచెలు ఏర్పాటు చేయాలి



బీచుపల్లి దగ్గర కృష్ణమ్మ విగ్రహం సమీపంలో ధ్వంసమైన ఇనుపకంచె



పుష్కరఘాట్ దగ్గర కొట్టుకుపోయిన ఇనుపకంచెలు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం దగ్గర కృష్ణానది పుష్కరఘాట్లలో భక్తుల రక్షణకోసం ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు పూర్తిగా విరిగిపోయాయి. గతంలో కృష్ణానదికి అధికంగా వచ్చిన వరదల కారణంగా ఇనుప కంచెలు కొట్టుకుపోవడంతో పుష్కరఘాట్లు ప్రమాదభరితంగా మారాయి. బీచుపల్లి పుణ్యక్షేత్రానికి నిత్యం వందల సంఖ్యలో, అమావాస్యతో పాటు జాతర సమయంలో వేల సంఖ్యలో భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకునేందుకు తరలివస్తారు. ప్రమాదాలబారిన పడకుండా ఏర్పాటుచేసిన ఇనుప కంచెలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇనుప కంచెలు విరిగిపోయి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు వాటిని ఏర్పాటు చేయకపోవడంతో నదిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు, పర్యాటకులకు రక్షణ కరువైందని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుష్కరఘాట్లలో ఇనుపకంచెలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.